క్లుప్తంగా

సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



రాజాంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాజాం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకుడు పేరాడ తిలక్ మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వార్డులు, ఆస్పత్రుల వద్ద పట్టభద్రుల ఓటర్లను కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ రాజాం కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాట్నూరు లక్ష్మణరావు, సచివాలయాల పట్టణ కన్వీనర్ కొయ్యాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీటీ కిరీటి

బొబ్బిలి: లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీ కిరీటి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సీడీపీఓలు, ప్రైవేట్ వైద్యులతో సమావేశమైన ఆయన లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ చేసినా, చేయించినా నేరమేనన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

సమయ పాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న త్రినాథ్

వంగర: సచివాలయాల ఉద్యోగులు వేళకు విధులకు హాజరు కావాలని ఈఓపీఆర్‌డీ లోపింటి త్రినాథ్ సూచించారు. మండల పరిధి కొప్పర, కొండచాకారాపల్లి సచివాలయాలను మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులు వేళకు విధులకు హాజరు కావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



చిన్నారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న ఏఎన్‌ఎం ప్రశాంతి

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-05లోని చిన్నారులకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షాతారాణి ఆదేశాల మేరకు ఏఎన్‌ఎం ప్రశాంతి ప్రతీ చిన్నారి వ్యక్తిగత వివరాలతో పాటు, వారి ఆరోగ్యం పరిశీలించి, ఆ విషయాలను సంబంధిత యాప్‌లో పొందుపరిచారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి ఉన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం : పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిర్లి పోతన్న, ఎలమ్మ ఆలయాల జాతర మంగళవారం వైభవంగా జరిగింది. శిర్లపోతన్న సంబరాలు డప్పు వాయిద్యాలు మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. వందల సంఖ్యలో భక్తులు ఎల్లమ్మను దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

బొబ్బిలి: పట్టణంలోని యాదవ వీధిలో శిర్లి ఎల్లమ్మ, పోతన్నలకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. అధికారులు, నేతలు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రాజెక్టులు సందర్శించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల రూపకల్పనలో బయటపడిన విద్యార్థుల సృజనాత్మకతను మెచ్చుకున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు మరింత బాగా రాణించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సైన్స్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

-బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి రూరల్: నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంఈఓ లక్ష్మణరావు, హెచ్‌ఎం చంద్రమౌళి



బాడంగి: హైస్కూల్‌లో హెచ్‌ఎం త్రినాథరావు రూపొందించిన రాకెట్



బొబ్బిలి రూరల్: అలజంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన



తెర్లాం: లోచర్ల పాఠశాలలో ప్రదర్శించిన ప్రాజెక్టులతో విద్యార్థులు



బాడంగి: హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అక్కారావు



బొబ్బిలి: ఐరిస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రేగిడి : ఖండ్యాం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



సంతకవిటి : ఎమ్‌ఆర్‌అగ్రహారం పాఠశాలలో సైన్సు డే



రాజాం : పెనుబాక పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన జగనన్న సచివాలయ ప్రాజెక్ట్



రాజాం సిటీ: కంచరాం పాఠశాలలో పవర్ సిస్టమ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రేగిడి: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. మండలంలోని రేగిడి గ్రామ సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు ఆధార్‌లో ఎటువంటి తప్పులున్నా సరి చేసుకునేందుకు ఈ కేంద్రానికి ఒరిజినల్ ఆధార్ కార్డుతో రావాలన్నారు.

అర్హులను 'వైఎస్సార్ బీమా'లో చేర్పించండి

తెర్లాం: అర్హులందరినీ వైఎస్సార్ బీమా పథకంలో చేర్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ తెలుపు రేషన్‌కార్డు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. మండలంలో 19,576 తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయని, వీటిలో 14,830 మంది మాత్రమే వైఎస్సార్ బీమా పథకంలో నమోదయ్యారని పేర్కొన్నారు. మిగిలిన 4,746 వైట్ రేషన్‌కార్డుదారులను పథకంలో చేర్పించాలని తెలిపారు. అలాగే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించాలన్నారు.



సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

సచివాలయాల్లో సకాలంలో సేవలందాలి



బొద్దాం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు కావల్సిన సేవలను సకాలంలో అందించాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సచివాలయాల వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందుతున్న వారి వివరాలు ప్రదర్శనగా ఉంచాలని సూచించారు. మండలంలో బొద్దాం గ్రామ సచివాలయాన్ని మంగళవారం పరిశీలించారు. జగనన్న హౌసింగ్ ప్రొగ్రెస్ పరిశీలించడంతో పాటు సఖి యాప్‌పై ఆరా తీశారు. సిటిజన్ ఔట్ రీచ్ వివరాలు పరిశీలించి, సచివాలయం ద్వారా అందించిన సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం



రామభద్రపురం: కొట్టక్కిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, టైలర్స్ సంఘం సభ్యులు

● జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి

రామభద్రపురం: అన్ని రంగాల వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని కొట్టక్కి గ్రామంలో నిర్వహించిన టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె టైలర్స్ సంఘ సభ్యులతో కలిసి కేకు కట్ చేశారు. అనంతరం జెడ్పీటీసీ చేతుల మీదుగా పలువురు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతివృత్తుల వారికి జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు ఏటా టైలర్లకు జగనన్న చేదోడు పథకం కింద రూ.10 వేల ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో టైలర్స్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం పీఏ స్వామి కేకు కట్ చేసి, అక్కడ కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలకు అందజేశారు.

కనులపండువగా సిరిమానోత్సవం



సిరిమాను అధిరోహించిన పూజారి సింహాచలం

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం కనులపండువగా కొనసాగింది. అమ్మవారి ఆలయం నుంచి గ్రామ ప్రధాన రోడ్డు వరకు మూడుసార్లు సిరిమాను రథాన్ని తిప్పారు. జాతరకు పోటెత్తిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామ పరిసరాలు యాత్రికులు, భక్తులు, సందర్శకులతో నిండిపోవడంతో ఆధ్యాత్మిక వాతావరణం తలపించింది. పూజారి రాగి సింహాచలం సిరిమాను అధిరోహించగా, భక్తులు మొక్కులు చెల్లించుకుని అమ్మవారి అనుగ్రహం పొందారు. జాతర నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖండ్యాంలో శిఖర కలశ పునఃప్రతిష్ఠ పూజలు



ఖండ్యాంలో 400 ఏళ్ల చరిత్ర గల శ్రీ ఉమా కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో 400 ఏళ్ల చరిత్ర గల శ్రీ ఉమా కాశీవిశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో శిఖర కలశ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు జరగనున్నాయని సహస్ర చండీ మహాయజ్ఞ బిరుదాంకితులు, శ్రీ విద్యా పూర్ణ దీక్షాపరులు అంపోలు ఉమారుద్ర కోటేశ్వర శర్మ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. శివాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. హోమాలు నిర్వహించేందుకు ప్రత్యేక హోమశాలను ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి: పట్టణంలోని ఆకులరెల్లి వీధి, రజక వీధి, సంఘ వీధి, బోయ వీధిలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు, వీధి దీపాలు, తాగునీటి వసతులు పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

రేపు జాబ్‌మేళా

బొబ్బిలి: స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మార్చి 2వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారంతా అర్హులని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9440921855ను సంప్రదించాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

● ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని విధాలా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం ఓ వైపు సాగుకు ఆర్థికసాయం చేస్తూనే మరోవైపు పంట నష్టపరిహారం అందిస్తూ అన్నదాతను ఆదుకుంటోందన్నారు. క్షేత్రస్థాయిలో రైతు సమస్యలను పరిష్కారించాలనే సదుద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. స్మార్ట్ టీవీ ద్వారా అధునాతన పద్ధతిలో రైతులకు పంటల సాగుపై శిక్షణ కూడా కల్పించడం జరుగుతోందన్నారు. వ్యవసాయ సంబంధిత పుస్తకాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునేందుకు కియోస్కో అందుబాటులో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పాలసొసైటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నమ్మతల్లి జాతర



అమ్మవారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు



చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

రామభద్రపురం: మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి తొలేళ్ల మహోత్సవం కనులపండువగా కొనసాగగా, మంగళవారం అమ్మవారికి ఘటాలకు విశేష పూజలు చేశారు. వేకువజామున 2 గంటల నుంచే అమ్మవారి గద్దెకు పోటెత్తిన భక్తులు చల్లంగ చూడు తల్లీ అంటూ పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు కూడా అమ్మవారిని దర్శించుకుని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. చదురుగుడిలో అమ్మవారి దర్శనార్థం భక్తులు ఇబ్బంది పడకుండా సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు, పోలీస్ సిబ్బంది సహాయంతో చర్యలు చేపట్టారు.

టెన్త్‌లో సత్తా చాటాలి

సంతకవిటి: విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో తమ సత్తా చాటాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సూచించారు. మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సూపర్ సిక్స్‌టీస్ ఫార్ములా నిమిత్తం ఎంపిక చేసిన 40 మంది విద్యార్థులతో మంగళవారం ఆయన మాట్లాడారు. అనంతరం జగనన్న గోరుముద్దలు కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. మండలంలో మిర్తివలస, తాలాడ, గుళ్లసీతారాంపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.



సంతకవిటి : మందరాడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాష్ట్ర పోటీల్లో రాణించిన సిరిపురం విద్యార్థులు



సంతకవిటి : రాష్ట్ర యూత్ అథ్లెటిక్ పోటీల్లో రాణించిన విద్యార్థులు

సంతకవిటి: రాష్ట్ర యూత్ అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని సిరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. గత నెల 26 నుంచి మూడు రోజుల పాటు ఈ పోటీలు ఏలూరులో జరిగాయని పాఠశాల పీడీ కె.సన్నిబాబు వెల్లడించారు. పాఠశాలలో చదువుతున్న పి.శ్రీలత 800, 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎ.తేజేశ్వరరావు హైజంప్‌లో తృతీయ స్థానాన్ని దక్కించుకోగా, ఎ.శ్రీకాంత్‌నాయుడు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నట్లు వెల్లడించారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం వి.వెంకటరావుతో పాటు గ్రామస్తులు అభినందించారు.

గ్రామదేవతల సంబరాల్లో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల్లో జరుగుతున్న కొత్తపోలమ్మ, పాతపోలమ్మ గ్రామదేవతల సంబరాల్లో మంగళవారం ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించమని వేడుకున్నారు. అనంతరం సంబరాల్లో భాగంగా చేసిన బిందెల డ్యాన్స్‌ను చూసి, కళాకారులను అభినందించారు. పారాది గ్రామంలో జరిగే గ్రామదేవతల సంబరాలను కూడా ఎమ్మెల్యే తిలకించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.



బిందెల డ్యాన్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి



పాగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న నైరా కళాశాల విద్యార్థులు

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగు చేసుకుంటే భూసారం వృద్ధి చెందుతుందని ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. మండల పరిధి పొగిరి గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి పొడి దుక్కుల్లో వీటిని చల్లుకోవడం ఎంతో శ్రేయస్కరమన్నారు. 30 రకాల తీగజాతి, దుంపజాతి, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలు వేసుకోవడం ద్వారా ప్రధాన పంటలకు కావాల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. ఎకరాకు 13 కిలోల వరకు అవసరమౌతాయని, ప్రతి ఆర్‌బీకేలో లభ్యమౌతున్నాయని పేర్కొన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని పంటల సస్యరక్షణతో పాటు దిగుబడిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ త్రివిక్రమ్ మంగళవారం పరిశీలించారు. తొలుత వేతనదారుల మస్తర్లు చూసిన ఆయన జాబ్ కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. పనుల్లో బినామీ కూలీలు ఎక్కువగా ఉన్నారనే ఫిర్యాదు అందిన మేరకే పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంటు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్